రంగవల్లుల పోటీలకు రారండి

- నేడు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు
- వాణినికేతన్‌లో ఏర్పాట్లు.. ఉదయం 10 గంటల నుంచి పోటీలు
- ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పార్టిసిపేషన్ బహుమతులు



కరీంనగర్ కల్చరల్, జనవరి 6: సంక్రాంతి పండుగ సందర్భంగా సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ప్రతీ యేడు మాదిరిగా ఆదివారం కరీంనగర్ ముఖరంపురలోని వాణీనికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వేదికగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనుంది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహణలో కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, స్థానిక జిల్లా స్పాన్సర్ హరిహర జువెల్లర్స్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు మహిళలు, యువతల నుంచి ఆహ్వానం పలుకుతోంది. ప్రథమ బహుమతి కింద 6 వేలు, ద్వితీయ బహుమతి కింద 4 వేలు, తృతీయ బహు మతి కింద 3 వేల రూపాయలతో పాటు 10 కన్సోలేషన్ అలాగే పార్టిసిపేషన్ బహుమతులను అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనేవారు మహిళలై ఉండాలి. చుక్కల ముగ్గులు మాత్రమే చేతితో వేయాలి. పరికరాలు వాడరాదు. జల్లెడ మాత్రం వాడవచ్చు. ముగ్గుకు కావాల్సిన రంగులు, పువ్వులు ఇతరత్రా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గులో ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలో చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు. గొబ్బెమ్మలు, బతుకమ్మ వంటివి తప్ప ఇతర వస్తువులు ఎక్కువగా అలంకరించరాదు. ముగ్గు అదనపు అందానికే వస్తువులను వాడా లి తప్ప ఇతర వస్తువులు ప్రాధాన్యం కాకూడదు. ఇతర వివరాలకు, పేర్ల నమోదుకు 9985411174, 9000488682, 9963999090 నెంబర్లలో సంప్రదించవచ్చు.



ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- స్పెషల్ యాక్షన్‌టీం(సాట్)లతో తనిఖీలు
- ట్రాక్టర్ల సీజ్, డ్రైవర్, ఓనర్‌లపై కేసులు
- రూ.1,800 నుంచి రూ.3,500కు పెరిగిన ఇసుక ధర

కరీంనగర్ క్రైం, జనవరి 6: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై పోలీసులు కొరఢాఝులిపిస్తున్నారు. అక్రమ రవాణాను నియంత్రించి, ప్రభుత్వ ఇసుకరీచ్‌ల ద్వారా ఆదాయం పెంచే విధంగా పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రత్యేకంగా స్పెషల్ యాక్షన్‌టీం (సాట్)లను రూపొందించారు. రెండు వారాల నుంచి కమిషనరేట్ వ్యాప్తంగా స్పెషల్ యాక్షన్‌టీంలు తనిఖీలను తీవ్రతరం చేశాయి. పోలీసు ఠాణాలకు సంబంధం లేకుండానే స్పెషల్‌టీంలు కమిషనరేట్ వ్యాప్తంగా ఇసుక వాహనాలను తనిఖీ చేస్తూ అనుమతిలేని ట్రాక్టర్, లారీ, టిప్పర్, ఇతర ఇసుక రవాణా వాహనాలన్నిటినీ సీజ్ చేస్తున్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్‌లపై ఇసుక దొంగతనం చేసినట్లు కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను కోర్టులో డిపాజిట్ చేస్తున్నారు. ఇసుక దొంగతనం కేసులో సీజ్ అయిన ట్రాక్టర్ బయటకు కావాలంటే ట్రాక్టర్ విలువను ఆర్టీఏ ద్వారా నిర్ధారించకుని ఆ మేరకు 2 నుంచి 3 లక్షల పూచీకత్తు ఇస్తేనే ట్రాక్టర్‌కు కోర్టు రిలీజ్ ఆర్డర్ ఇస్తుం ది. కమిషనరేట్ వ్యాప్తంగా దాదాపు 10 స్పెషల్ యాక్షన్‌టీంలు ఇసుక అక్రమ రవాణాపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. డిసెంబరు నుంచి ఇప్పటి వరకు పోలీసుల తనిఖీలలో 40 వరకు ట్రాక్టర్లు పట్టుబడగా 28 కేసులు నమోదయ్యాయి.

● తగ్గిన ఆన్‌లైన్ బుకింగ్‌లు

ఏడాది కాలంగా కరీంనగర్ శివారులోని బొమ్మకల్, ఇరుకుల్ల, చేగుర్తి, మొగ్ధుంపూర్, వల్లంపహాడ్, మొగ్ధుంపూర్, ఖాజీపూర్, రేణికుంట తదితర మానేరు వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా నడిపించారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్‌ఎండీసీ ఆధ్వర్యంలోని ఇసుక రీచ్‌లలో 'మన ఇసుక వాహనం' బుకింగ్‌లు ఘననీయంగా తగ్గిపోయాయి. జిల్లాలోని చేగుర్తి, బొమ్మకల్, శ్రీనివాసనగర్, ఖాజీపూర్, రామంచ, బిక్కవాగు, లింగాపూర్, తనుగుల, మల్లారెడ్డిపల్లి, ఊటూర్, చల్లూర్, ఇప్పలపల్లిలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 12 అధికారిక ఇసుక రీచ్‌లున్నాయి. ఈ రీచ్‌ల ద్వారా 2022 సంవత్సరంలో ఆన్‌లైన్‌లో 28 వేల బుకింగ్‌లు చేసుకోగా 2023 సంవత్సరంలో కేవలం 2 వేల బుకింగ్‌లు మాత్రమే వచ్చాయి. దీంతో ఇసుకరీచ్‌ల ద్వారా ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పడిపోయింది. దీనికి కారణం కొందరు ఇసుక రవాణాదారులు ముఠాగా ఏర్పడి ఎలాంటి అనుమతులు లేకుండా, కొందరు పెద్దల అండదండలతో వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తోడేసి అమ్ముకుంటున్నారు. దీనిపై గనులు, భూగర్భశాఖ అధికారులు గుర్తించి పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీంతో ప్రత్యేక కార్యాచరణతో రంగంలోకి దిగిన సీపీ చర్యలకు ఉపక్రమించారు. ఇసుక అక్రమ రవాణాకు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖలకు చెంది న కొందరు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

● పెరిగిన ఇసుక ధరలు

రెండు వారాల క్రితం ట్రాక్టర్ ఇసుక ధర రూ.1800ల నుంచి రూ.2300 వరకు ఉండేది. పోలీసుల తనిఖీలు, ఇసుక ట్రాక్టర్లపై కేసులతో ఇసుక ధరను అమాంతంగా రూ.3500కు పెంచారు. టీఎస్‌ఎండీసీలో మన ఇసుక వాహనం ద్వారా బుక్ చేసుకున్నప్పటికీ దూరంను బట్టి రూ.2300ల నుంచి 3 వేల వరకు ధర ఉంటున్నది. వారం రోజుల పాటు ఆన్‌లైన్ బుకింగ్ లభించటం లేదు. ఇప్పటికే బుక్ అయిన ఇసుకకు ఒక్కో ట్రాక్టర్‌కు రోజుకు 3 ట్రిప్పులు వంతున వస్తున్నాయి. ఇసుక వాహనంలో కొద్ది ట్రాక్టర్లు మాత్రమే నమోదు చేసుకోవటంతో ఈ పరిస్థితి ఉంది. ఇసుక ధర పెరగడంతో నిర్మాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోం

- పార్టీ కోసం పనిచేసిన వారిని ఆదుకుంటాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిగురుమామిడి, జనవరి 6: అధికారంలో ఉన్నామని పేదవారికి అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితిల్లో ఊరుకునేది లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, సర్దార్‌పాపన్న విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మహిళలు మంత్రిని ఘణంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండ లంలోని 17 గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలతో, నాయకులతో మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా అందరికీ అందు బాటులో ఉంటానన్నారు. మండలంలోని ఒగులాపూర్ గ్రామ భూ నిర్వాసితుల సమస్యలను తప్పకుండా పరిష్కరి స్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, ఇతర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు చిట్టుమల్ల రవీందర్, జడ్పీటీసీ గీకురు రవీందర్, నాయకులు పోలు స్వప్న, పూల లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 6: భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలను ఈ నెల 10న నిర్వహించ నున్నట్లు జిల్లా యువజన అధికారి ఎం వెంకట్ రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మై భారత్-వికసిత్ భారత్-2047 అనే అంశంపై జిల్లాస్థాయి డిక్లమేషన్ (వక్తృత్వ) పోటీ ఉంటుందని తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని, కేవలం 7 నిమిషాలలో ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగించాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలిచిన యువతకు ప్రశంసా పత్రం, మెమోంటో అందజేస్తామని, రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి 50 వేలు, మూడవ బహుమతి 25 వేలు ఇద్దరికీ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే యువత ఈ నెల 9న సాయంత్రం 5 గంటల్లోపు నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో లేదా 9652782815 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతులకు నిరంతర విద్యుత్ అందించాలి

- టీఎస్ఎన్‌పీడీసీఎల్, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న టీఎస్ఎన్‌పీడీసీఎల్, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి

గణేశ్‌నగర్, జనవరి 6: రైతులకు నిరంతరంగా విద్యుత్ అందించాలని, ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని విద్యుత్ ఉద్యోగులకు టిఎస్ఎన్‌పిడిసిఎల్, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ సర్కిల్ కార్యాలయంను ఆయన పరిశీలించారు. ఎస్ఈ గంగా ధర్, ఏడీలు అధికారులతో కలిసి పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. విద్యుత్‌ను ఆదాచేయాలని, రెవెన్యూ కలెక్షన్స్‌ను ఇంకా రాబట్టాలన్నారు. బిల్లులు చెల్లించినప్పుడు నూతన టెక్నాలజీతో పేమెంట్ చేసే విధంగా అందరికీ అవగాహన చేయించాలన్నారు. ఎస్ఈ చాంబర్‌లో విద్యుత్ ఉద్యోగులు, సంఘాల నాయకులు సీఎండీని కలిశారు. తెలంగాణ ఎలెక్ట్రిసిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి వెంకటేశ్వర రావు, మోహన్‌రెడ్డి, సంధ్యారాణి, గణపతి, సీజీఎంలు అశోక్, ప్రభాకర్, వేణుబాబు, ఎస్సీ వడ్లకొండ గంగాధర్, డీఏలు, ఏడీలు అన్ని యూనియన్లు అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన పథకాలపై అవగాహన అవసరం

కరీంనగర్ టౌన్, జనవరి 6: పేద నిర్మూలన పథకాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్ అన్నారు. శనివారం ఆయన నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, విద్యార్థులకు ఉపయోగపడే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. చక్కగా చదువుకొని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'వాటర్ ప్లస్' హోదా గర్వకారణం

- నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరుస్తాం
- నగర మేయర్ యాదగరి సునీల్‌రావు


కరీంనగర్ టౌన్, జనవరి 6: దేశంలో పెద్ద పెద్ద నగరాలకు ధీటుగా పోటీపడి చిన్న నగరమైన కరీంన గర్ నగరపాలక సంస్థ వాటర్ ప్లస్ హోదా దక్కించుకుందని, ఇది చాలా గర్వకారణమని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌తో మేయర్ విలేకరులతో మాట్లాడారు. నగరప్రజలు, పాలకవర్గ సహకారం, పారిశుద్య కార్మికులు, సిబ్బంది కృషి ఫలితంగా నగరపాలక సంస్థకు ఉత్తమ అవార్డులు, హోదాలు దక్కుతున్నాయని అన్నారు. ఇంత గొప్ప హోదా కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నగరపాలక సంస్థకు వాటర్+ హోదా రావడంతో మాజీ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, మాజీ పౌరసరఫరాల శాఖ మత్రి గంగుల కమలాకర్, మాజీ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ తమ పాలవకర్గం, అధికార యంత్రాంగాన్ని ప్రశంసించినట్లు తెలిపారు. అన్ని కేటగిరీల వారీగా నగరపాలక సంస్థ పారిశుద్య వ్యవస్థను మెరుగుపర్చడం ద్వారానే నగరానికి వాటర్+ హోదాను కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ప్రకటించిం దని, ఇంత గొప్ప హోదా నగరానికి దక్కడం చాలా సంతోషమన్నారు. గతంలోనే నగపాలక సంస్థ ఓడీఎఫ్, ఓడీఎఫ్+, ఓడీఎఫ్++ రావడంతో పాటు సఫాయిమిత్ర సురక్షా ఛాలేంజ్‌లో దేశంలో మంచి ర్యాంకు సాధించి 4 కోట్ల ప్రైజ్ మనీ కూడా పొందిందని గుర్తు చేశారు. ఇప్పుడు నగరపాలక సంస్థకు వాటర్+ హోదా రావడం చాలా గొప్ప విషయమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నేతికుంట యాదయ్య, బుచ్చి రెడ్డి, దిండిగాల మహేష్, బోనాల శ్రీకాంత్, ఏదుల్ల రాజశేఖర్, బండారి వేణు, భూమాగౌడ్, కుర్ర తిరుపతి, ఆకుల నర్మద నర్సయ్య, తుల రాజేశ్వరి బాలయ్య, సల్ల శారద రవీందర్, వంగల శ్రీదేవి పవన్, లెక్కల స్వప్న వేణు, సానిటేషన్ సూపర్‌వైజర్ రాజమనోహర్, ఎనిర్వాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు







యూనివర్సిటీ భూములు కబ్జా చేస్తే ఊరుకోం

● ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సంకశాల మల్లేష్



ఫార్మసీ కళాశాల భూములను పరిశీలిస్తున్న వీసీ, ఎస్‌యూ సిబ్బంది

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన యూనివర్సిటీ కళాశాల భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్. మల్లేష్ హెచ్చరించారు. రెండు రోజుల నుంచి శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల భూములను కళాశాల పక్కనే ఉన్న ప్రైవేట్ భూములతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా చదును చేసే ప్రయత్నం చేయగా వెంటనే దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని వాహనాలను సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాల భూములను ఇకపైన ఎవరూ కబ్జా చేయకుండా పూర్తి స్థాయి ఫెన్సింగ్ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు వేస్తామన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● ఫార్మసీ కళాశాల ఎదుట ఏబీవీపీ ధర్నా

గణేశ్‌నగర్,జనవరి 6: ఎస్‌యూ భూమిపై కన్నేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శాతవాహన యూనివర్సిటీ ఎదుట శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ పుసాల విష్ణు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ ఫార్మసీ కళాశాల భూమిని చదును చేసిన విషయంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఉపకులపతి మల్లేష్ లేదా డ్రాయింగ్ ఆఫీసర్ సైన్స్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ జయంతితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉన్నా వారు ఒక కాంట్రాక్ట్ అధ్యాపకుడితో ఫిర్యాదు చేయించడం, బాధ్యుడిగా చేసే ప్రయత్నం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత ప్రభుత్వ అండదండలతో ఉపకులపతి, ఆయన అనుకూల వర్గం ఏం చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రభుత్వం అయినా శాతవాహన విశ్వవిద్యాలయ అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహణ సమితి సభ్యుడు అంజన్న, నగర కార్యదర్శి నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధు, లాఫోరం కన్వీనర్ ప్రమోద్, శ్రీ వర్ధన్, సాయి, రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగుల సంఘం

ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్‌గా నాగేందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, జనవరి 6: తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా సర్దార్ నాగేందర్‌సింగ్‌ను నియమించినట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఫయాజ్ అలీలు ప్రకటించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన వారికి నాగేంద్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, జనవరి 6 : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో ఆనారోగ్యం కారణంతో ఒల్లెం మల్లు (78) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. మల్లు గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పి, నరాల బలహీనతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో వ్యాధి గురించి తరచుగా బాధపడుతుండేదని పోలీసులు, బంధువులు తెలిపారు. మల్లు శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో తాను పడుకున్న మంచంతో పాటు దుప్పటికి నిప్పు అంటిచుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మల్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మల్లు కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు.

గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి

శంకరపట్నం, జనవరి 6: మండలంలోని రాజాపూర్ గ్రామంలో శుక్రవారం గుండెపోటుతో రైతు పొలంలోనే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాతంగి ఓదెలు (55) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా గుండెపోటు రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయాడు. ఓదెలు ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెతకగా పొలంలో పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, జనవరి 6: మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ శివారులో శనివారం సాయంత్రం గంగాధరకు చెందిన పలువురు పేకాట రాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి 16వేల 300 రూపాయల నగదును పట్టుకున్నట్లు ఎస్సై కె. వెంకట్‌రావు తెలిపారు. 10 మోటార్‌సైకిళ్లు, 12 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

వేములవాడ టౌన్, జనవరి 6: వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి శనివారం ఒక ప్రకటన ద్వారా వేటగాళ్లను హెచ్చరించారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల, రుద్రంగి మండలం మానాల గ్రామాల్లో ఇటీవల వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇద్దరు అమాయకులు మరణానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపించామని తెలిపారు. పంట పొలాలను కాపాడేందుకు రైతులు, వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రామడుగు ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

రామడుగు, జనవరి 6: రామడుగు మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై ఈ నెల 17న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ ఎంపీటీసీ జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో పదిమంది సభ్యులతో కలిసి గత నెల 19న ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆయన ఈ నెల 8న అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం నిర్వహించుటకు నోటీస్ జారీ చేశారు. అయితే ఎంపీపీ దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ వేయడంతో 8న నిర్వహించనున్న అవిశ్వాస తీర్మానం ఆపాలని స్టే విధించింది. దీంతో అవిశ్వాస తీర్మానానికి బ్రేక్ పడింది. ఎంపీపీ, జడ్పీటీసీ, ఆర్డీవోకు హైకోర్టు స్టేను సమర్పించినట్లు విలేకరులతో ఎంపీపీ తెలిపారు.

పోక్సో బాధితులకు సహాయం అందించాలి

తిమ్మాపూర్, జనవరి6: పోక్సో బాధితులను గుర్తించి కావలసిన సహాయం అందించాలని మహాత్మానగర్ సర్పంచ్ జక్కని శ్రీవాణి తెలిపారు. శనివారం మండలంలోని మహాత్మానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో భిక్షాటన చేసే పిల్లలను గుర్తించాలన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. బాల కార్మికులు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆ దిశగా పాటు పడాలన్నారు. గ్రామల్లో బాల్య వివాహాలను నిరోధించడంలో గ్రామ పంచాయతీ పాలకులు ఆయా శాఖల అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలని చట్టబద్ధమైన దత్తతను గుర్తించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. పిల్లల హక్కులను కాపాడేలా అధికారులు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడిపివో ఆరవింద, సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్లు కవిత, పద్మ, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్‌లో ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల హుజురాబాద్‌లో- 2, అల్ఫోర్స్, డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరీంనగర్‌లో-1, సెమిస్టర్-3లో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల హుజురాబాద్‌లో-1 అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఏడుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 6: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసుల్లో ఒకరికి పది రోజులు, మరొకరికి ఐదు రోజులు, మరో ఐదుగురికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 45మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి జైలుశిక్షతో పాటు 14,500 జరిమానా విధించారని తెలిపారు. మిగతా 38 మంది వాహనదారులకు 66 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన

- నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహణ - ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన



లాలపల్లిలో మాట్లాడుతున్న శ్రీదేవసేన

ఎలిగేడు, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అమలు చేసేందుకు ప్రజలనుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన వచ్చిందని ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన అన్నారు. శనివారం మండలంలోని లాలపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాపాలన ఉమ్మడి జిల్లా కరీంనగర్ నోడల్ అధికారి శ్రీదేవసేనను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన దరఖాస్తుదారులతో శ్రీదేవసేన ముచ్చటించారు. అనంతరం ఆమె లాలపల్లిలో మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు పెద్దపల్లి జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెద్దపల్లి కలెక్టర్‌గా రెండున్నర సంవత్సరాల పాటు తాను పనిచేయడం తన కెరియర్‌లో ఒకమైలురాయిగా నిలిచిపోతుందన్నారు. గ్యారంటీ పథకాలపై మంచి అవగాహనతో ప్రజలు వారికి అవసరమైన పథకాలకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. నాలుగునెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదుచేసి, నిర్దిష్ట ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం అర్హులను ఎంపికచేసి పథకాలను అమలుచేస్తామని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజలకు పథకాలను అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగమే గ్రామాల్లో ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. నూతన రేషన్‌కార్డుల కోసం సైతం ప్రజాపాలన కార్యక్రమంలో తెల్లకాగితంపై దరఖాస్తు సమర్పించాలని, రేషన్‌కార్డు దరఖాస్తులు, ఇతర దరఖాస్తుల సమర్పణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఎన్ శిరీష, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏఐఏఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడిగా దమ్మన్నపేట విద్యార్థి


రామ్ విలాస్

గంభీరావుపేట, జనవరి 6: ఆల్ ఇండియా అగ్రికల్చరల్ స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఏఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడిగా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన రామ్ విలాస్ పాశ్వన్ ఎన్నికయ్యాడు. ఆల్ ఇండియా అగ్రికల్చర్ స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా రామ్‌విలాస్‌ను ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ప్రకటించారు. దమ్మన్నపేటకు చెందిన విస్లావత్ లోక్యా నాయక్, సత్తవ్వ దంపతుల కుమారుడు రామ్‌విలాస్ పాశ్వన్. ఇతను ఐసీఏఆర్ భారత వ్యవసాయ పరిశోధన విద్యాయలంలో (న్యూఢిల్లీ)లో పరిశోధనలను కొనసాగిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి అన్ని రాష్ట్రాల విద్యార్థుల నామినేషన్‌కి రిటర్నింగ్ అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. దీనికి గాను అన్ని రాష్ట్రాల నుంచి 304 మంది నామినేషన్‌లు వేశారు. వారి యొక్క కార్యకలాపాలను, ఆలోచన లు పరిగణలోకి తీసుకుని నామినేషన్ రిటర్నింగ్ అధికారులు మంచి ప్రతిభ కనబర్చిన రాంవిలాస్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. మారుమూల గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి రవాణాదారులపై టాస్క్‌ఫోర్స్ స్పెషల్‌డ్రైవ్

- ఆరుగురి బైండోవర్

కోల్‌సిటీ, జనవరి 6: గంజాయి నిర్మూలించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రామగుండం కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గోదావరిఖని వన్‌టౌన్, మంచిర్యాల, బెల్లంపల్లి వన్‌టౌన్, చెన్నూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వేల్పుల సాయిచందర్, ఎస్‌కే జమీర్, జాడి సాయిపవన్, ఎండీ అన్వర్, గుజ్జుల సాయితేజ, భీముల అంజిని బైండోవర్ చేశారు. బైండోవర్లనుఉల్లంఘిస్తే జైలుశిక్ష తప్పదని సీపీ హెచ్చరించారు.

'కాళేశ్వరం'లో లోపాలున్నాయని తెలిసినా చర్యలేవి?

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి


ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 6: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో లోపాలు ఉన్నాయని నాలుగేళ్లుగా బీజేపీ నాయకులు చెబుతున్నారని, మరి ఎందుకు చర్యలు చేపట్టలేదని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. రాయికల్ పట్టణంలోని 4వ వార్డులో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవాలను వెలికితీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశిస్తే బీజేపీ నాయకులు సీబీఐ ఎంక్వైరీ కోరడం హాస్యాస్పదమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను లొంగదీసుకోవడానికే బీజేపీ నాయకులు కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ విచారణ కోరుతున్నారని జీవన్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత లోపించి బ్యారేజీ కుంగిపోవడం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో సీడబ్ల్యూసీ అనుమతులు లేవని బీఆర్‌ఎస్‌వాళ్లే చెప్పారని అన్నారు. ప్రాజెక్ట్ అనుమతులు పరిశీలించి నిధులు ఇవ్వాల్సి ఉండగా, పూర్తి స్థాయిలో అనుమతులు లేని ప్రాజెక్ట్‌కు నిధులు ఏ విధంగా సమకూర్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పారదర్శకతతో వాస్తవాలను వెలికితీయాలనే భావనతో, న్యాయ విచారణకు ఆదేశిస్తున్న తరుణంలో బీజేపీ నాయకులు కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు చేపట్టడం లేదనడం ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ప్రాణహిత తుమ్మడిహెట్టి వద్ద మహారాష్ట్ర ప్రభుత్వంతో గతంలోనే ఒప్పందం కుదిరిందని, కేవలం రూ.10 వేల కోట్లతో తుమ్మడిహెట్టి వద్ద నుంచి ప్రాణహిత ప్రవాహాన్ని మళ్లించి సుందిళ్లకు కలుపవచ్చని అన్నారు. ఒకే లిఫ్ట్ ద్వారా ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోయవచ్చని, రెండు లిఫ్ట్‌ల భారం తగ్గిపోతుందని అన్నారు. తక్షణమే తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టేందుకు వచ్చే మార్చి బడ్జెట్‌లో ప్రతిపాదించి, సంవత్సర కాలంలో నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో కొనసాగే పార్టీ అని, జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, నిరుపేద వర్గాలకు ఇళ్ల నిర్మాణం అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలను ఏ రాజకీయ పార్టీ కొత్తగా ఏ కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మెట్‌పల్లి, జనవరి 6: మెట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట గ్రామ శివారులో మల్లన్న టెంపుల్ వద్ద ఎస్ఐ చిరంజీవి వాహనాల తనిఖీ చేపట్టగా ద్విచక్రవాహనాలపై అనుమానాస్పదంగా కనిపించిన యువకులను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా నిర్మల్ జిల్లా నుంచి మెట్‌పల్లికి టీఎస్ 21ఎల్1369 నెంబరు గల ద్విచక్రవాహనంపై గంజాయిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని గంజాయి, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ శేఖర్, వీఆర్ఏ సమక్షంలో పంచనామా చేసి ఇరువురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి పట్టుకున్న ఎస్ఐ చిరంజీవి, ఏఎస్ఐ ప్రకాశ్, సిబ్బంది జలెందర్, సునీల్, మల్లేశ్‌లను సీఐ అభినందించారు.

సౌదీ అరేబియాలో దమ్మన్నపేట వాసి మృతి


రాజన్న (ఫైల్)

ధర్మపురి, జనవరి 6: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న (50) అనే వ్యక్తి సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం రాజన్న 11 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా దేశానికి వెళ్లాడు. రెండేళ్లకు ఒకసారి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఏడాది క్రితం కూడా ఇంటికి వచ్చి తిరిగి అక్కడికి వెళ్లాడు. రాజన్న పనిచేస్తుండగా రెండు నెలల క్రితం వాతం వచ్చినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఆరోగ్య పరిస్థితి క్షీణించడం వల్ల అక్కడే ఆసుపత్రికి తీసుక వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజన్న పరిస్థితి విషమించి ఈ నెల 4న మృతి చెందాడు. మృతుడు రాజన్నకు రావాల్సిన 11 ఏళ్ల ఇన్సూరెన్స్ లీగల్ డబ్బులు ఇప్పించాలని, మృతదేహాన్ని దమ్మన్నపేట స్వగ్రామానికి పంపించాలని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా కోరుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



లక్ష్మణ్‌కుమార్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ టౌన్, జనవరి 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయాధికారుల స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీనాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనంగా గావించగా సూపరింటెండెంట్ అల్లి శంకర్ రాజన్న కండువా కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

జగిత్యాల టౌన్, జనవరి 6 :అనారోగ్య కారణంతో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని తులసీ నగర్‌కు చెందిన బోగ సౌమ్య(36) అనే మహిళ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. తీవ్ర మనోవేదనకు గురైన సౌమ్య శనివారం తన తల్లిగారి ఇంటి వద్దకు వచ్చి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ నటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: గత ఎన్నికల్లో తనను మోసం చేశారని సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్, గుంటుక మహేశ్, ఏలూరి రవి తనకు రూ. 1లక్ష ఇస్తానని చెప్పి ప్రచారం చేసేందుకు 15రోజుల్లో తిప్పుకున్నారని, ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసంచేశారని ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఐదుగురిపై అదనపు వరకట్నం కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: తనను అదనపు వరకట్నం తీసుకురావాలని తన భర్త, అత్త, మామలు తరుచూ వేధించారని సిరిసిల్ల పట్టణంలోని గాజుల నవ్య అనే మహిళ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అదనపు వరకట్నం కింద శనివారం కేసు నమోదు చేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. తన భర్త గాజుల మల్లేశం, అత్త, మామ, ఆడబిడ్డలు వివాహమైనప్పటి నుంచి తనను వేధించి అదనంగా రెండు లక్షల రూపాయలు కట్నం తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేశారని బాధితురాలు నవ్య ఫిర్యాదు మేరకు అయిదుగురిపై కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, జనవరి 6: సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాకం బానుచందర్, రాకం మనోహర్ తనకు ఇచ్చే ఎనిమిది లక్షల రూపాయలు తిరిగి ఇవ్వమని అడిగినందుకు చంపుతామని బెదిరించారని బాధితుడు రాగుల రాములు ఫిర్యాదుపై శనివారం ఇద్దరిపై కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నామని టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జనవరి 6: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్ కు చెందిన రహీల్ అనే యువకుడు ఒక సెల్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఏడాది క్రితమే వివాహం జరిగింది. బార్య ప్రస్తుతం గర్భవతి. షాపు నిర్వహణలో పలువరి వద్ద అప్పులు చేశాడని దానికి తోడు మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద రుణాలు తీసుకున్నాడని అప్పుల వాళ్ల వేదింపులు, మరో వైపు మైక్రో సంస్థల ప్రతినిదులు వేదింపులు భరించలేక శుక్రవారం రాత్రి ఎవరికీ చెప్పకుండా నీరుకుళ్ల మానేరు బ్రిడ్జి వద్దకు వెళ్లి గడ్డిమందు సేవించాడు. అతని అచూకీ గంట తర్వాత కనుగొన్న కటుంబ సభ్యులు ఉటాహుటిన అస్పత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్ అటు నుంచి హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం బాదితులు అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పిచ్చికుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 6: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో శనివారం పిచ్చి కుక్క కరిసి ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామంలోని దారి వెంట వెళుతున్న పోగుల కౌశిక్, దుర్గం రాఘవ, బోలమల్ల శివలపై పిచ్చికుక్క వెంటపడి దాడి చేసింది. దీంతో వారిని కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పిచ్చి కుక్కలు ఎక్కువయ్యాయని, కొన్ని వీధి కుక్కలు రోగాల భారిన పడి సంచరిస్తున్నాయని, ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి పిచ్చి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వరద కాలువకు నీటి విడుదల


రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు

మల్యాల, జనవరి 6: వరదకాలువ కింద సాగు చేస్తున్న రైతులను ఆదుకోవడానికి ఎస్సారెస్పీ నుంచి రెండువేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేయగా రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దిగువకు విడుదల చేశారు. యాసంగి సాగు చేసిన రైతులు కాలువలో నీరులేక ఆందోళన చెందుతుండగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఇరిగేషన్ సీఈతో మాట్లాడి ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో శనివారం నీరు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకునే బాధ్యత తమదేనని ప్రతిపక్ష నేతలు మొసలి కన్నీరు కారవడం విడ్డూరంగా ఉందని అన్నారు. యాసంగిలో గుంట పంట ఎండిపోకుండా చూస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనలు చెయకుండానే ముందస్తుగానే తామే నీటి విడుదల చేశామని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ డీఈ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వీరబత్తిని ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పారమిత హెరిటేజ్ పాఠశాల వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న పారమిత చైర్మన్ ప్రసాదరావు

కరీంనగర్ రూరల్, జనవరి 6: పద్మనగరలోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో శనివారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పారమిత ఎక్స్‌పోలరికా విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో విద్య, కళలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులను నగదు, జ్ఞాపికలతో సత్కరించారు. టైలెస్ వాయోజ్ అనే పేరుతో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు నృత్యాలు, పాటలు, ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మీత, వినోదరావు, రాకేష్, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రితేష్, మెహత, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్తలు రాములు రబీంద్రో పాత్రో, హరిప్రియ, సరిత పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



వాణీనికేతన్ ఎంబీఏ కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

గణేశ్‌నగర్, జనవరి6: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందిచుకొని ఉద్యోగాలను సాధించాలని ఎస్‌యూ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డి.హరికాంత్ విద్యార్థులకు సూచించారు. శనివారం వాణీనికేతన్ ఎంబీఏ కళాశాలలో స్నాతకోత్సవమునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎంబీఏ, ఎంకామ్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా భవిష్యత్తును పూల బాటగా మార్చుకోవచ్చని అన్నారు. కళాశాల డైరెక్టర్ డా.డి.వెంకటరావు మాట్లాడుతూ ప్రైవేట్ ఎంబీఏ కళాశాలలో స్నాతకోత్సవం జరపటం ఇదే మొదటిసారి అని అన్నారు. విద్యార్థులకు సాంకేతిక, మానవీయ విలువల గురించి వివరించారు. వాణీనికేతన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్‌రెడ్డి, వాణీనికేతన్ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రశాంత్‌రావు స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమములో కళాశాల సెక్రెటరీ, శాతవాహన యూనివర్సిటీ ఈసీ మెంబర్ ఐ.దీపికా, కళాశాల ఉపాధ్యాయ బృందం తదితారులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి'

సుభాష్‌నగర్, జనవరి 6: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికలపై కేటీఆర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పది సంవత్సరాల కాలంలో ప్రజలకు ఏం చేశారని ఇపుడు ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. తద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రం నుంచి అధికంగా నిధులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి కృషి చేస్తారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 15 స్థానాలు కాంగ్రెస్ గెలుచుకుంటుందని జోష్యం చెప్పారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరరని, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గతంలో జరిగిన అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ విసిరిన సవాల్‌కు ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ ఎందుకు సిద్ధంగా లేరని ప్రశ్నించారు. సమావేశంలో బోయినిపల్లి చంద్రయ్య, సిగిరి శ్రీధర్, బాపురెడ్డి, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ డిపో మేనేజర్‌గా శ్రీకాంత్

హుజూరాబాద్, జనవరి 6: హుజూరాబాద్ డిపో మేనేజర్‌గా సామల శ్రీకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అర్పితను వరంగల్ లోని స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. కల్వకుర్తి డిపో మేనేజ ర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌ను హుజూరాబాద్‌కు బదిలీ చేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన డీఎం అర్పిత, డీఎం శ్రీకాంత్‌ను ఆర్టీసీ కార్మికులు సన్మానించారు.

కళాశాల విద్యార్థులకు అల్పాహారం

గంగాధర, జన వరి 6: గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమాన్ని డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల శనివారం ప్రారంభించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న దృష్ట్యా అధ్యాపక బృందం తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో అధ్యాపక బృందం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. విద్యార్థులు వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఫలితాలు సాధించి కళాశాలకు, అధ్యాపకులకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

కరీంనగర్ రూరల్, జనవరి 6: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందన్నారు. సంక్రాంతి పండుగ పల్లెల్లో సంస్కృతి సాంప్రదాయాలను ఉట్టి పడేలా వైభోవేతంగా జరుపు కుంటారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**రామడుగు:** రామడుగు మండలం గోపాల్‌రావు పేట అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కృతి కూడా ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

●**కరీంనగర్ కల్చరల్:** స్థానిక పద్మనగర్ మానేరు సెంట్రల్ స్కూల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి పండుగ కళ, సంస్కృతీసాంప్రదాయాలు ఉట్టిపడేలా పాఠశాల ఆవరణను అలంకరించారు. పండుగ విశిష్ఠతను ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న అల్ఫోర్స్, మానేరు విద్యార్థులు

స్కూల్ బ్యాగుల అందజేత

కరీంనగర్ టౌన్, జనవరి 6: నగరంలోని శ్రీనగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కరీంనగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ దేవసేన చేతులమీదుగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్‌రావు, కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్ల గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి, సెక్రటరీ రమణారెడ్డి, కోమల్ రెడ్డి, కరుణాకర్, కరివేద మహిపాల్ రెడ్డి, మండల విద్యాధికారి ఎం మధుసూదనాచారి, సెక్టోరల్ అధికారి కె అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రాముడి అక్షింతల పంపిణీ

కరీంనగర్ రూరల్, జనవరి 6: నగరంలోని 18వ డివిజన్ రేకుర్తి కొత్త వాడ కాలనీ, విజయపురి, శాతవాహన కాలనీలో అయోధ్య మందిరంలోని రామతీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం అక్షింతలను పంపిణీ చేశారు. అమృతేశ్వర ఆలయ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆలయం నుండి వచ్చిన అక్షితలను ప్రతి ఇంటికి జాడిబాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు చంద్రగిరి వేణు, అస్తపురం వినేష్, లింగయ్య, మహిళా భక్తులు జాడి సుజాత, గొల్లె కవిత, గొల్లె అంజలి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీలకు మానేరు విద్యార్థి ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 6: పంజాబ్ రాష్ట్రంలోని లూథియానాలో ఈనెల 7నుంచి జరగనున్న 67వ జాతీయ స్థాయి పాఠశాలల అండర్-17 జూడో చాంపియన్‌షిప్ పోటీలకు మానేరు విద్యాసంస్థల విద్యార్థి అమన్‌రెడ్డి ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అమన్ రెడ్డి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, పీఈటీలు మహేందర్, జహేద, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేడు పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జనవరి6: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని జగిత్యాలరోడ్‌లో గల విద్యుత్ ఇంజనీర్ల సంఘ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రచయిత్రి తోట నిర్మలారాణి రచించిన 'అద్దం నా చిరునామా కాదు' పుస్తకావిష్కరణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెరవే అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా అఖిల భారత తెరవే అధ్యక్షుడు జూకంటి జగన్నాథం హాజరు కానుండగా బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. అతిథులుగా కేంద్రసాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు బి ప్రసేన్, రచయి తలు అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగ భూషణం హాజరౌతారని తెలిపారు. కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'నివేశన స్థలాలపై జర్నలిస్టులు ఆందోళన చెందొద్దు'



కలెక్టర్‌కు మొక్కను అందచేస్తున్న ఎమ్మెల్యే గంగుల

సుభాష్‌నగర్, జనవరి 6: కరీంనగర్‌లో పని చేస్తున్న జర్నలిస్టులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేసిన నివేశన స్థలాల పట్ల ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం వర్కింగ్ జర్నలిస్టుల నివేశన స్థలాల్లో చేపట్టిన నిర్మాణ పనుల నిలిపివేత గురించి జర్నలిస్టులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై నేరుగా చర్చించేందుకు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. తమ ప్రభుత్వ హయాంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందజేశామన్నారు. అట్టి నివేశన స్థలాలపై వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి, జర్న లిస్టులు ఇళ్ళ నిర్మాణాలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాను ఎల్లప్పుడు జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడతానని, వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే గంగుల స్పష్టం చేశారు.

ఎస్‌యూ ఫార్మసీ కళాశాల భూములను రక్షించాలి

గణేశ్‌నగర్, జనవరి.6: శాతవాహన విశ్వ విద్యాలయం ఎల్‌ఎమ్‌డి ఫార్మసీ కళాశాలలో గల భూమి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని కబ్జాదారుల నుంచి రక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి కోరారు. ప్రస్తుతం ఎంత భూమి ఉందో మొత్తం సర్వే చేయాలని సర్వే రిపోర్ట్ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూమి ఇంచు మేర కబ్జా జరిగినా ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం అవుతుంటే యూనివర్సిటీ వీసీ, ఈసీ సభ్యులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. యూనివర్సిటీలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. యూనివర్సిటీ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. వీసీ, రిజిస్ట్రార్, యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఫార్మసి కళాశాల భూములను కాపాడి కబ్జాకు యత్నించే వారిని శిక్షించాలని కోరారు.

బ్లూబెల్స్‌లో అలరించిన 'యూలో టెక్కి క్లౌడ్ ఈవెంట్'



ప్రదర్శనను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 6: సాంకేతికత, సృజనాత్మక ఆవిష్కరణలు, సమస్యా పరిష్కార నైపుణ్యాలతో కూడిన నమూనాలతో 'యూలో టెక్కి క్లౌడ్ ఈవెంట్' పేరుతో హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ హైస్కూల్‌లో శనివారం ప్రదర్శన నిర్వహించారు. సుమారు 350 మంది విద్యార్థులు 4 దశల్లో తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శనను కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, ఎస్ఎస్ఏ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, ఎంఈఓ మధుసూదనా చారి, సైన్స్ ఆఫీసర్ సీహెచ్ జయపాల్‌రెడ్డి, ఆస్పెక్ట్‌సైట్స్ టెక్నాలజీ ప్రైవేయిట్ లిమిటెడ్ చైర్మన్ కె శ్రీనివాస్, జిల్లా ఫిజికల్‌సైన్స్ ఫోరం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్ జంగ సునీతా మనోహరరెడ్డి ప్రారంభించారు. ఈ అకాడమిక్ ఇయర్‌లో యూలో టెక్కీ ఎడ్‌టెక్ సంస్థ ఆధ్వర్యంలో సీబిఎస్ఇ కరిక్యులమ్‌లో కంప్యూటర్ సైన్స్‌ను ఒక భాగంగా చేర్చి కోడింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు వివరించారు. అతిథులు, సందర్శకులు విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం





దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మానకొండూర్, జనవరి 6: ప్రజా సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఊటూర్, వేగురుపల్లి, వెల్ది, వన్నారం గ్రామాల లో శనివారం ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. ఊటూర్‌లో ఎమ్మెల్యే పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులను గుర్తించి ఆరు గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. మానకొండూర్ మండలంలో ప్రజాపాలన దరఖాస్తులు 22,573 వచ్చినట్టు అధికారులు తెలిపారు.

గంగాధర: ప్రజా సంక్షేమానికే ప్రజాపాలన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం తాడిజెర్రి, ఉప్పరమల్యాల, వెంకంపల్లి, వెంకటయ్యపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సులకు ఎమ్మెల్యే సత్యం హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలలో రెండు పూర్తిగా అమలు చేశామని మిగిలిన వాటిని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి నాయత్వంలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసమే ప్రజాపాలన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధనర్సయ్య, సర్పంచ్‌లు బొల్లాడి మంజుల, ముక్కెర మల్లేశం, శ్రీమల్ల మేఘరాజు, ఎంపీటీసీలు ద్యావ మధుసూదన్‌రెడ్డి, ముద్దం జమున, వంగల వసంత మల్లికార్జున్, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా, ఎంపీవో జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో ప్రజాపాలన కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని 30వార్డుల్లో 12,319 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

శంకరపట్నం: మండలంలో ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారంటీలకు 15,124 దరఖాస్తులు వచ్చాయి. ఇతర దరఖాస్తులు 2,355 వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

గన్నేరువరం: ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ మండలంలో మొత్తం 7,658 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు.

ఇల్లందకుంట: ప్రజాపాలన కార్యక్రమంలో 10,857 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తీగల శంకర్ తెలిపారు. దరఖాస్తులను ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో పొందపరుస్తామని తెలిపారు.

వీణవంక: మండలంలోని వల్భాపూర్‌లో అధికారులు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. వల్భాపూర్‌లో 651 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 17,628 దరఖాస్తులు వచ్చాయని, భూమి, రేషన్ కార్డులు ఇతర సమస్యల కోసం 2,990 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ తిరుమల్‌రావు తెలిపారు.

కరీంనగర్ టౌన్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం ఆరుగ్యారంటీల సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా తమ పాలకవర్గం కృషి చేస్తుందని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారం ముగిసింది. చివరిరోజు మేయర్ నగరంలోని 14, 47 డివిజన్లలో పర్యటించి ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. 8 రోజుల్లో దాదాపు 90 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిండిగాల మహేష్, షర్ఫొద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో సాగునీటి కష్టాలు
-మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, జనవరి 6: కాంగ్రెస్ పాలనలో సాగునీటికి రైతులు కష్టాలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. శనివారం ఆయన గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం కేసీఆర్ పెట్టుబడి సతిహాయాన్ని అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడిచినా ఇప్పటికీ రైతుబంధు వేయలేదని, అప్రకటిత కరెంటు కోతలతో రైతు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో 122 కిలోమీటర్ల పొడవున్న వరద కాలువలో సీఎం కేసీఆర్ 365 రోజులు నీరుండేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కాలువ ఎండిపోయి సాగునీరందక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ప్రాజెక్టులో నీళ్లు ఉన్నప్పటికీ ఎందుకు అందించడంలేదని ప్రశ్నించారు. 24 గంటల్లో వరదకాలువకు, ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి నారాయణపూర్ రిజర్వాయర్‌ను నింపాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నవీన్ రావు, సర్పంచ్‌లు విజేందర్‌రెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

చిగురుమామిడి, జనవరి 6: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని లంబాడిపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని అన్నారు. గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా తమ ప్రభుత్వం ద్వారా అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల అనంతరం అభివృద్ధే లక్ష్యంగా అందరు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగెల్లి వకుళ-లక్ష్మరెడ్డి, ఎంపీపీ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్, ఎంపీడీవో నర్సయ్య, అన్ని శాఖల అధికారులు, వైస్‌ఎంపీపీ బేతి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌పై అసత్య ప్రచారం
-టూటౌన్‌లో ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జనవరి6: మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్‌పై దుష్ప్రచారం చేస్తూ, ఆయన ప్రతిష్టకు భంగం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో అసత్యపు పోస్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ శనివారం రెండో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాల్ హిందు అనే ఫేస్‌బుక్ ఖాతా ద్వారా 'వెలుగులోకి టీఆర్‌ఎస్ అక్రమాలు' అంటూ మాజీ ఎంపి వినోద్‌కుమార్ అన్న కూతురు బోయినిపల్లి సరితరావుకు ఎలాంటి పరీక్ష రాయకుండా తెలంగాణ జెన్‌కోలో ఏఈ ఉద్యోగం ఇచ్చారని పోస్ట్ చేశారన్నారు. వినోద్‌కుమార్‌కు సోదరుడు లేరని, ఆయన కుటుంబంలో సరితారావు అనేవారే లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువత నగర అధ్యక్షులు దీకొండ కులదీప్ వర్మ, మైనార్టీ విభాగం అధ్య క్షులు మీర్ షౌకత్‌అలీ, రాష్ట్ర నాయకులు దూలం సంపత్, నాయకులు సాయికృష్ణ, గంగాధర చందు, నవాజ్‌హుస్సేన్, వాజిద్, సందీప్ వర్మ, ప్రణయ్‌గౌడ్, సాకెత్, సాయి, ప్రజ్యోత్, దీపక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం

కరీంనగర రూరల్, జనవరి 6: మాజీ ఎంపీ వినోద్ కుమార్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని చింత కుంట ఎంపీటీసీ భూక్యా తిరుపతి నాయక్ హెచ్చరించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు చూస్తున్నారన్నారు. ఇలాంటి కుట్రలతో వినోద్‌కుమార్ గెలుపును ఆపలేరన్నారు. అసత్య తప్పుడు ఆరోపణలు చేస్తే తరిమి కొడతామని హెచ్చరించారు.

ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి6: కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ లోని ఫార్మసీ కళాశాల ఆవరణలోకి శనివారం అక్రమంగా ప్రవేశించిన ఏబీవీపీ కార్యకర్తలు సిమెంట్ స్తంభాలను పడగొట్టడంతో పాటు ప్రిన్సిపాల్ చాంబర్‌లోకి ప్రవేశించి వీసీ, రిజిస్ట్రార్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారని ప్రిన్సిపాల్ కేశెట్టి శ్రీశైలం ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏబీవీపీ నాయకులు పూసాల విష్ణు, అంజన్న, నక్క ప్రమోద్ కుమార్, బామల్ల నందు, అన్నాడి శ్రీవర్ధన్‌రెడ్డి, చింతలతాడెపు మధు, లోకుల రాజశేఖర్, సుంకె అజయ్ కుమార్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

●ఫార్మసీ కళాశాల ఆవరణలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు కొత్త వీరారెడ్డి అనే వ్యక్తి మరికొందరితో కలిసి కళాశాల ఆవరణలోకి ప్రవేశించి జేసీబీతో క్యాంపస్‌లోకి ఒక షెడ్డును కూల్చివేసి, మొక్కలను ధ్వంసం చేసినట్లు ప్రిన్సిపాల్ కేశెట్టి శ్రీశైలం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాపాలన ఫ్లెక్సీల చింపివేతపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జనవరి 6: ప్రజా పాలన సదస్సుల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లను చింపివేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు శనివా రం రెండో టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఎండీ లయీక్, అబ్దుల్ రహ్మాన్, సయ్యద్ లయీక్, ఎండీ ఖలీద్ ఉన్నారు.

మద్యం షాపు ఏర్పాట్లను అడ్డుకోవాలి

కరీంనగర్ క్రైం, జనవరి 6: కరీంనగర్‌లోని 23వ డివిజన్ ఆదర్శనగర్‌లో రోడ్డు పక్కన మద్యం షాపు ఏర్పాటు కోసం చేపట్టిన నిర్మాణం ఆపాలని టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణికి శనివారం వినతి పత్రం అందజేశారు. 23వ డివిజన్ ఆదర్శనగర్ బోర్డ్ చౌరస్తా వద్ద కొత్తగా నిర్మిస్తున్న మరొక్క వైన్స్ అక్రమ నిర్మాణాలను కూడా వెంటనే నిలిపివేయాలని కోరారు. జనావాసాల మధ్య, ఆసుపత్రి, శివాలయం, సీతారామాంజనేయ టెంపుల్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఈ వైన్‌షాపుల నిర్మాణాలనే వెంటనే కూల్చివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఉన్నారు.

ధర్మరాజుపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు

హుజూరాబాద్‌రూరల్, జనవరి 6: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంకణాల భగవాన్‌రెడ్డి మోటారు వాహనచట్టం, డ్రంకెన్ డ్రైవ్ కేసుల గురించి అవగాహన కల్పించారు. అలాగే కంకణాల విజయరెడ్డి గృహహింస, ఆస్తిహక్కు, మహిళల హక్కులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే రెండోఅదనపు జూనియర్ సివిల్ జడ్జి స్వాతి లోక్‌అదాలత్ అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్, న్యాయవాది భానుకిరణ్, సర్పంచ్ లక్ష్మారెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా కుమారస్వామి

సైదాపూర్, జనవరి 6: బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా సైదాపూర్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో సహాయక ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్న చెన్న బోయిన కుమారస్వామి నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం కుమారస్వామి నియామకపత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్, కార్యదర్శి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషాన్ పటేల్, ముఖ్య సలహాదారు శ్రీనివాస్‌గౌడ్‌లకు కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీ భవనం పరిశీలన

మానకొండూర్, జనవరి 6 : మండలంలోని లక్ష్మీపూర్‌లో నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి లలితాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఎంపీపీ ముద్దసాని సులోచన, వైద్యులు బియాబాని, ఎండీ ఏజాస్ పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్డీవో రాజు, తహసీల్దార్ విజయ్‌కుమార్, రూరల్ సీఐ సంతోష్, జడ్జీలు అలేఖ్య, స్వాతి, కోర్టు సిబ్బందితో పాటు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు అక్షింతలను అందజేశారు. బీజేపీ నాయకులు గంగిశెట్టి రాజు, వొడ్నాల విజయ, యాంసాని శశిధర్, బాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్‌లో అయోధ్య రామ మందిరం తీర్థ ట్రస్టు నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలు, కలశంను శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి, ఎంపీ టీసీ మోతె భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ అడితం కుమార స్వామి, ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో అయ్యప్ప స్వాములకు దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లిలో గంగిపల్లి వేణు అనే యువకుడు ఏర్పాటు చేసిన సిమెంట్ అండ్ స్టోన్స్ వ్యాపార దుకాణాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.